క్లుప్తంగా

పైప్‌లైన్ పగిలి వృథాగా నీరు



పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

కొండపి: కొండపిలో డిపో సెంటర్ నుంచి జాళ్లపాలెం రోడ్డులోకి వెళ్లే వీధిలో పంచాయతీకి నీరు విడుదల చేసే పైప్‌లైన్ పగిలిపోయింది. గ్రామానికి పంచాయతీ నీళ్లు వదిలేటప్పుడు ఆ పైపు పగిలిపోవడంతో నీరు వృథాగా పక్కనే మురుగు కాలువలోనికి పోతున్నాయి. పంచాయతీకి నీరు వదిలిన సమయంలో ఎంత సమయం నీరు వదిలితే అంత సమయం ఆ పైపు నుంచి నీరు వృథాగా బయటకు పోతుంది. వారం రోజులైనా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయకపోవడం ఏంటని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీరు వృథాగా పోకుండా చూడాలని కోరుతున్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు

టంగుటూరు: పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధనరాజు మాట్లాడుతూ చదవడం మాకిష్టం లాంటి కార్యక్రమాల్లో పిల్లల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

ఆలయానికి వెండి ఆభరణాల సమర్పణ



వెండి ఆభరణాలు, వెండి వస్తువులు అందజేస్తున్న దాత మధు దంపతులు

పామూరు: స్థానిక వాసవీమాత ఆలయానికి వైఎస్సార్ సీపీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు మంచికంటి మధుసూదన్ దంపతులు ఆదివారం 500 గ్రాముల వెండి ఆభరణాలను ఆలయ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావుకు అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ అమ్మవారికి ఆభరణాలు 250 గ్రాములు, గర్భాలయ వెండి వాకిలి తయారికి 250 గ్రాముల వెండి వస్తువులు అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వైష్ణవి డిగ్రీ కాలేజీలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కనిగిరిరూరల్: పట్టణంలోని వైష్ణవీ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఓఎస్‌డీ కేవీఎన్ రాజు పాల్గొని సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యంతో అన్ని పండుగలూ ఘనంగా జరుపుకోవాలన్నారు. విద్యార్థులు క్యాండిల్స్ వెలిగించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు, గంటా విద్యాసాగర్, బైబిల్ కాలేజీ అధ్యాపకులు టి.రాజా, వై హనోక్, మహిలా డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు



రాత్రి చీకటిని తలపిస్తున్న కొండపి ప్రధాన రహదారి

పంచాయతీలోని కొండపి ప్రధాన రహదారిలో బస్టాండ్ సెంటర్ నుంచి కామేపల్లి సెంటర్ వరకు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి 9 గంటలు దాటితే వ్యాపారస్తులు దుకాణాలు మూసివేసిన తర్వాత ఆ ప్రాంతమంతా చీకటిని తలపిస్తుంది. అదే విధంగా పంచాయతీలోని కట్టవారిపాలెం గ్రామంలో కూడా ప్రధాన రహదారిలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కుక్కలతో బెంబేలు



ఫోటో:07కెడిపి05: గుంపులుగా ఉన్న కుక్కలు

పంచాయతీలో కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్లే వారిని వెంటపడుతున్నాయి. దీంతో వాకర్లు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారిలో, వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగక అల్లాడుతుంటే, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, కుక్కలు వెంటబడుతుంటే భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు కుక్కలు ద్విచక్రవాహనదారులను వెంటాడుండటంతో తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారు.

రోడ్లపైనే వర్షం నీరు



వర్షం నీటితో బురద రోడ్డు ను తలపిస్తున్న సిమెంట్ రోడ్డు

ఇటీవల కురిసిన వర్షానికి వర్షం నీరు రోడ్డు మీద నిలుస్తుంది. జాళ్లపాలెం రోడ్డులో సైడ్ కాలువలోని మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీనికి తోడు వర్షం నీరు తోడవడంతో ఆ ప్రాంతం జలమయమై ప్రయాణికులు ప్రయాణం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. మరీ ముఖ్యంగా నడిచి వెళ్లే వారికి తీవ్రమైన ఇబ్బందికర పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆ రహదారిలో పెద్దకళ్లగుంట జాల్లపాలెం, పీరాపురం వైపు నిత్యం ప్రయాణికులు ప్రయాణిస్తూనే ఉంటారు. వందల కొద్ది వాహనాల్లో ప్రయాణికులు ఆ నీటిలోనే ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. అలాగే కట్టవారిపాలెం గ్రామంలో సైడ్ కాల్వలో నీరు నిండి, ఆ బురద నీరు రోడ్డు మీదకి వస్తుంది. ఆ ప్రాంతం కొంచెం గుంతగా ఉండడంతో రోడ్డు మీద నీరు అక్కడే నిలుస్తుంది. వాహనదారులు ఆ ప్రాంతంలో వేగంగా వెళ్లడంతో రోడ్డుమీద నడిచే వారిపై ఆ నీళ్లు పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వెంటనే సైడ్ కాలువల్లో పూడికలు తీయించి ఆ బురదనీరు రోడ్డుమీదకి రాకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సెస్ తప్పనిసరిగా చెల్లించాలి



టంగుటూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

టంగుటూరు: వాహనదారులు వ్యవసాయ మార్కెట్ సెస్ తప్పనిసరిగా చెల్లించాలని ఒంగోలు మార్కెట్ యార్డు కమిటీ కార్యదర్శి సువ్వరల అన్నారు. స్థానిక టోల్‌ప్లాజా వద్ద శనివారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంట రవాణా వాహనాలు సెస్ చెల్లించకుండా పోతున్న వాటిని గుర్తించి 30 వాహనాలకు రూ.1.80 లక్షల సెస్ విధించారు. కార్యక్రమంలో మార్కాపురం, పొదిలి మార్కెట్ యార్డుల కార్యదర్శులు గుంటూరి కోటేశ్వరరావు, రవిశంకరరెడ్డి, సూపర్‌వైజర్లు హేమంతు, వెంకటయ్య, కిషోర్, జలరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదానానికి మాలధారుల భిక్షాటన



మహా అన్నదానానికి భిక్షాటన ప్రారంభిస్తున్న మాలధారులు

పామూరు: పామూరులోని అయ్యప్ప ఆలయం వద్ద ఈనెల 20వ తేదీ శుక్రవారం నాడు తలపెట్టిన మహా అన్నదాన నిర్వహణకోసం అయ్యప్ప మాలధారులు సరకుల సేకరణ నిమిత్తం భిక్షాటన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ చైర్మన్ గుత్తి రాజా మాట్లాడుతూ ప్రజలు భక్తితో స్వామివారి అన్నదానానికి సరుకులు విరాళంగా ఇవ్వాలని, ఆలయ వద్ద జరిగే అన్నదానానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఇర్రి కోటిరెడ్డి, అయ్యప్ప, శివ, మాలదారులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల పాలనలో
పట్టించుకునేదెవరు..?

- కొండపి పంచాయతీలో సమస్యల వెల్లువ
- పడకేసిన పారిశుధ్యం
- వెలగని వీధి దీపాలు
- కుక్కలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

కొండపి:

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెత నియోజకవర్గ కేంద్రమైన కొండపికి సరిపోతుంది. కొండపి పంచాయతీకి దాదాపు 15 ఏళ్ల నుంచి సర్పంచ్ లేరు. ప్రత్యేక అధికారులతో పాలన కొనసాగిస్తున్నారు. పంచాయతీలో అనునిత్యం ప్రజలను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి.పేరుకే నియోజకవర్గ కేంద్రమైన ఇక్కడ వసతులు అంతంతమాత్రమే. దీంతో ప్రజలు సమస్యలతో సహవాసం చేయాల్సిన పరిస్థితి.

పడకేసిన పారిశుధ్యం..

పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. చెత్తను ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నారు. కొండపి నుంచి పెద్దకళ్లగుంట వెళ్లే రహదారిలో చెత్త, వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో అక్కడే ఉన్న చెత్తలోకి నీరు చేరి కుళ్లి దుర్వాసన రావడంతో వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన చెందుతున్నారు. కొండపి, కట్టవారిపాలెం గ్రామాల మధ్య ప్రవహించే అలుగు వాగులో కూడా ఈ చెత్తను వేస్తున్నారు. చెత్త సంపద కేంద్రం ఉన్న పంచాయతీ వారు కూడా చెత్తను చెరువు సమీపంలో వేస్తున్నారు. ఆ చెత్తను తీసుకువెళ్లి చెత్త సంపద కేంద్రంలో వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.



జాల్లపాలెం రోడ్డులో దుర్వాసన వెదజల్లుతున్న చెత్త



కొండపి, కట్టవారిపాలెం మధ్య అలుగు వంతెన వద్ద ఉన్న చెత్త

వైభవంగా గోపూజ, మహా నివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు



గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ముదుమాల నారాయణ రెడ్డి, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో సామాజిక న్యాయం లేదు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

కనిగిరిరూరల్: ఎస్సీ వర్గీకరణలో సామాజిక న్యాయం లేదని అఖిల భారత మాలల జేఏసీ కన్వీనర్, మాల సంఘాల జేఏసీ కన్వీనర్ యరజాల బాలనారాయణ, ఐక్యవేదిక నియోజకవర్గ కార్యదర్శి కల్వకూరి శాంతరాజు అన్నారు. గుంటూరులో ఈ నెల 15న జరగనున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభను విజయవంతం చేయాలని స్థానిక కార్యాలయంవద్ద కరపత్రాన్ని సీనియర్ నాయకుడు నారయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న ఉమ్మడి షెడ్యూల్ కులాలను విభజించి మనువాదులు ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు ఈ సభకు భారీగా తరలి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయులు కొటికల బాలబాదుర్ల, కొటపాటి రమణ, పందిటి మోహన్, యానాది, పి.చిన్న కొండయ్య, దమ్ము శ్రీను, దమ్ము వెంకటయ్య జె. ధర్మేంద్ర , కె.సుబ్బారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

- గురువులను ఘనంగా సన్మానించిన విద్యార్థులు

పొన్నలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 46 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మళ్లీ అదే పాఠశాల్లో కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు అప్పటి విద్యార్థుల్లోని ఆలూరి రాజేశ్వరరావు, ముదివర్తి చలపతిరావులు చొరవ తీసుకొని ముందుకు వచ్చి తమతో చదువుకున్న విద్యార్థులతో సంప్రదింపులు చేసి ఒకచోటకు తీసుకొచ్చారు. ఈ ఆత్మీయ కలయిక ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 1978–79 పదో తరగతి చదివిన వీరంతా పాఠశాల్లో కలుసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు విచ్చేసి తమకు విద్యాబోధన చేసిన గురువులకు ఘనంగా స్వాగతం పలికారు. పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకొని హిందీ ఉపాధ్యాయుడైన రవణయ్యకు పాదాభివందన చేసి ఘనంగా సన్మానించి జ్ఞాపకను అందజేశారు.

పేదలకు నిత్యావసరాల అందజేత



పేదలకు సరుకులు అందజేస్తున్న దృశ్యం

కందుకూరు: సేవా కార్యక్రమాల్లో భాగంగా ఐఎఫ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌సీ ఫౌండేషన్ అధ్యక్షుడు సాజిద్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా తమ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలైన వితంతు మహిళలకు ఇంటికి సరిపడా నిత్యావసర వస్తువులు అందిస్తామని వివరించారు. క్రమం తప్పకుండా తమ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని, దాతలు ముందుకు వచ్చి సాయం అందిస్తున్నారని చెప్పారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి పేదలకు సాయం అందిస్తే వారికి అండగా నిలిచినట్లు అవుతుందన్నారు. ఫౌండేషన్ ట్రెజరర్ హఫీజ్, టౌన్ ఇన్‌చార్జి అయూబ్‌ఖాన్, పఠాన్, షంషుద్దీన్, శేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

పామూరు: స్థానిక అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప పడిపూజ ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట అయ్యప్ప ఉత్సవమూర్తికి అర్చకులు చిమటా పట్టాభి, కార్తీక్, బొమ్మన శ్రీనివాసులు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం అయ్యప్ప భక్తబృందం ఆలపించిన భక్తిగీతాలతో మాలధారులు పారవశ్యంలో మునిగారు. ఈ సంద్భంగా మాలధారులకు వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మన శ్రీనివాసులు, రాధ దంపతులు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుత్తి వెంకట రాజా, భక్తులు పాల్గొన్నారు.



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు



ఉలవపాడు మెయిన్ సెంటర్‌పై మంచు దుప్పటి




మంచులోనూ తప్పని ప్రయాణాలు

హిమ సొగసు


ఉలవపాడు: శీతాకాలం వచ్చి చాలాకాలమైనా మంచు మాత్రం కురవలేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం తుఫాన్‌లు రావడంతో మంచురావడం ఆలస్యమయింది. అయితే తుఫాన్ ప్రభావం పోవడంతో ఆదివారం తొలిమంచు కురిసింది. ఉలవపాడుపై మంచు దుప్పటి కప్పినట్లుగా హైవే, బస్టాండ్ సెంటర్, ఇళ్ల మధ్య కూడా మంచు ఏర్పడింది. ఉదయం 8 గంటల వరకు సూర్యుడు కనపడలేదు. హైవేలో లైట్లు వేసుకునే వాహనాలు వెళ్లాయి.



హైవే పై పరిస్థితి ఇలా..



ఇళ్ల మధ్య మంచు పరదాలు



ఉలవపాడు లోపలికి వచ్చే రోడ్డును కమ్మేసిన మంచు

నేడు విద్యుత్ అంతరాయం

కందుకూరు రూరల్: మండలంలోని పాలూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గుడ్లూరు ఫీడర్ లైన్‌కు తగిలే చెట్ల కొట్టేందుకు సోమవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ నిపివేస్తున్నట్లు ఏఈ టీవీ నరసింహం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీరంగరాజపురం, మదన గోపాలపురం, పాలూరు, దొండపాడు, చినిగేవారిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. తిరిగి రెండు గంటల నుంచి విద్యుత్ సరఫరా అవుతుందన్నారు.

భగవద్గీతపై ప్రచారం

లింగసముద్రం: త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని మండలంలోని తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం, మాలకొండ్రాయునిపాలెం, విశ్వనాథపురం గ్రామాల్లో ఆదివారం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేక దుత్తలూరు కమిటీ సభ్యులు నిర్వహించారు. మార్గశిర మాసంలో ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండాలని, దైవ భక్తితో భగవద్గీతను ఆచరించాలన్నారు. జి.ప్రసాద్, ఎం.కొండారెడ్డి, ఎం.పెదకొండారెడ్డి, జి.సుధాకర్, కె.వెంకటేశ్వర్లు, జి.పెంచలరత్నం, కె.నరసింహులు, ఎం.ధనలక్ష్మి, ఎం.నాగమ్మ, డి.మధు, ఎం.ప్రేమ్‌కుమార్, సీహెచ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడులోని శాఖ గ్రంథాలయం, చాకిచర్లలోని బుక్ కీపింగ్ సెంటర్‌లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో నీతికథలు, మహనీయుల చరిత్రలను చదివించారు. నిరంతర సమాచారం కోసం పత్రికలను చదవాలని తెలిపారు. గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు కోరారు.